ప్రజాశక్తి
శనివారం 24 జూన్ 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

కౌలురైతు దంపతులపై హత్యాయత్నం ఘటనలో..

నిందితులపై 'అట్రాసిటీ' కేసు

- అన్నదమ్ముల ఆస్తి వివాదం నేపథ్యంలో కిరాతకంగా దాడి
- బాధితులను పరామర్శించిన కౌలు రైతుసంఘం, సిపిఎం నేతలు

ప్రజాశక్తి-బాపట్ల

అన్నదమ్ముల మధ్య ఆస్తి వివాదాలు బాపట్ల మండలం, చుండూరుపల్లిలో దళిత కౌలు రైతు దంపతులపై హత్యాయత్నానికి దారితీశాయి. జాస్తి అంకమ్మ చౌదరి, అతని కుటుంబసభ్యులు కౌలు రైతు దంపతులపై కత్తితో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన కౌలు రైతు దంపతులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులను కౌలురైతు సంఘం, సిపిఎం నేతలు పరామర్శించారు.

బాపట్ల మండలం, చుండూరుపల్లి గ్రామానికి చెందిన అన్నదమ్ములైన జాస్తి అంకమ్మ చౌదరి, జాస్తి వంశీకష్ణలకు మూడు ఎకరాల భూమి విషయంలో కొంతకాలంగా వివాదం నెలకొని ఉంది. వంశీకష్ణ ఉద్యోగ రీత్యా హైదరాబాదులో ఉంటున్నారు. భూమి ఆయన పేరు మీద ఉంది. గ్రామానికి చెందిన కౌలు రైతు మేరుగమోటు సతీష్, రాహేలు దంపతులకు ఆయన ఆ పొలాన్ని కౌలుకు ఇచ్చారు. తాజాగా గురువారం పొలంలో దిక్కు దున్నుతున్న సమయంలో అంకమ్మ చౌదరి, అతని భార్య సుజాత, కుమారుడు దినేష్ తో కలిసి అక్కడికి వచ్చారు. భూమి తమదంటూ గొడవకు దిగారు. భూమి యజమాని వంశీకష్ణ వద్ద తాము కౌలుకు తీసుకున్నానని సతీష్ కౌలు అగ్రిమెంటును వారికి చూపించాడు.



బాధితుడిని పరామర్శిస్తున్న నాయకులు

దీంతో అంకమ్మ చౌదరి, అతని కుమారుడు, భార్య మరింత రెచ్చిపోయి కత్తులతో సతీష్, రాహేలుపై దాడికి దిగారు. విచక్షణారహితంగా వారిని గాయపరిచారు. తీవ్ర గాయాలతో రక్తస్రావంతో బాధపడుతున్న దంపతులు గ్రామంలోకి పరుగులు తీశారు. సమాచారం అందిన వెంటనే ఎస్సైలు వెంకటప్రసాద్, నాగశ్రీను గాయాలపాలైన వారి వివరాలను సేకరించి.. బాధితుల ఫిర్యాదు మేరకు అంకమ్మ చౌదరి, భార్య సుజాత, కుమారుడు దినేష్, మరో ఇద్దరిపై హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెంకటేశులు తెలిపారు. నిందితులు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

కౌలు రైతు దంపతులకు పరామర్శ

పెత్తందారుల దాడిలో గాయపడి బాపట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దళిత కౌలురైతు ఎం.సతీష్, అతని భార్య రాహేలును కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.హరిబాబు పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసు, రెవిన్యూ అధికారులు వెంటనే ▶ 2లో

ఇక జగనన్న సురక్ష పేరుతో..

- మళ్లీ సేవల పేరుతో ఇంటింటికీ వాలంటీర్లు
- గ్రామాల్లో కుప్పలుకుప్పలుగా పేరుకుపోయిన భూసమస్యలు
- ఒక్కటీ పరిష్కారం చేయలేని దైన్యం..
- 'స్పందన'కు తిరుగుతున్న జనం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

గడపగడపకూ కార్యక్రమ శకం ముగిసింది. ఎమ్మెల్యేలు ఆసక్తిగా తిరిగలేకపోతున్నారు. దానిపై సిఎం జగన్ ఎన్నిసార్లు సమీక్ష చేసినా ఫలితం లేదు. అరకొరగానే తిరిగారు. దాన్ని దాదాపుగా పక్కనబెట్టినట్లు తెలుస్తోంది. ఇప్పుడు మళ్లీ జగన్ సురక్ష పేరుతో కొత్త కార్యక్రమాన్ని తెరపైకి తెచ్చారు. జులై 1 నుంచీ నెలరోజుల పాటు దీన్ని అమలు చేయాలని ఇప్పటికే ఆదేశాలు వచ్చాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలతో సిఎం జగన్ నేరుగా సమావేశం నిర్వహించి దీని ఉద్దేశాన్ని వివరించారు. ఎమ్మెల్యేలుగా వారి బాధ్యత ఏమిటనేదీ నిర్దేశించారు. ప్రజలకు అందని సమస్యలను ఈ కార్యక్రమంలో అమలు చేయాల్సి ఉంది. వీటిలో ఎక్కువ సేవలకు సంబంధించినవే ఉన్నాయి. 11 రకాల సమస్యలను ఎంపిక చేశారు.



సురక్షపై సిఎం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్

ముందుగా వార్డుల్లో వాలంటీర్లు తిరిగి జనం నుంచి సమస్యలు గుర్తించాలి. అవసరాలు ఏమైనా ఉంటే గుర్తించాలి. ఎక్కువశాతం సర్టిఫికేట్లు ఉన్నాయి. వాటిని నమోదు చేసి పరిష్కారం చేయాలి. అధికారులు సచివాలయం పరిధిలో ఒకరోజు కార్యక్రమం పెట్టుకుని పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కారం చేయాల్సి ఉంది. గడపగడపకూ కార్యక్రమంలో అనేక రకాల సమస్యలు వచ్చాయి. వాటిని ఎంత మేరకు చేయగలిగారు? అనేదీ చూడాలి. ఆన్‌లైనుతో ముడిపడి ఉన్న వాటిని ఏ మేరకు తీర్చగలరనేదే ప్రశ్నగా ఉంది. రేషన్‌కార్డుల్లో పేర్లు మార్పులు, ఒక్కరే ఉంటే వారికి సంక్షేమ పథకాలు ఆగిపోవడం, కరెంటు బిల్లు ఎక్కువగా ఉందనే కారణంతో పించన్లు నిలిపివేత వంటివి పెండింగులోనే ఉన్నాయి. ఎమ్మెల్యేలకు ఇవే ఎక్కువగా వచ్చాయి. వాటిని వదిలేశారు. ఏదో ఒకటి చెప్పి దాటేశారు. వీటితో పాటు గ్రామాల్లో కుప్పలు తెప్పలుగా భూ సమస్యలు పేరుకుపోయాయి. నాలుగేళ్లలో భూసమస్యలు పరిస్కారం కాలేదు. అర్జీలు ▶ 2లో



గ్రోత్ సెంటర్ వద్ద సెల్ఫీ దిగుతున్న టిడిపి ప్రజాప్రతినిధులు, నాయకులు

రైతులు, పేదల పట్ల సిఎంకు చిత్తశుద్ధి లేదు..

అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి 4లో

'ఏలూరు' పెద్దలకే అధికారుల అండ.!

- సాగుభూములను ఖాళీ చేయకుంటే చావు తప్పదని హెచ్చరిక.!
- సబ్‌కలెక్టర్ వద్ద బాధితుల వేడుకోలు
- న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన సేతు మాధవన్

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం రెవెన్యూ డివిజన్‌లోని అర్ధవీడు మండలం నల్లమల అటవీ ప్రాంతం అంచుల్లో ఉంది. ఆ ప్రాంతంలో అక్కడి అధికారులదే పెత్తనంగా సాగుతోంది. ఉన్నతాధికారులెవ్వరూ కన్నెత్తి చూడరనే ధైర్యంతో పెద్దలకు కొమ్ము కాస్తూ... అక్రమాలతో ధనార్జనకు పాల్పడుతున్నారు కొందరు అధికారులు..! పెద్దలకు వత్తాసు పలికిన రెవెన్యూ, పోలీస్ అధికారులు అమాయక ప్రజలను భయభ్రాంతులకు



తాజాగా పైరును దున్నేసిన దుండగులు

గురిచేస్తున్నారు. తాము చెప్పినట్లుగా నడుచుకోని పక్షంలో చస్తారంటూ హెచ్చరిస్తున్నారని పలువురు బాధితులు మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్ వద్ద వాపోయారు. దీనిపై వెంటనే స్పందించిన సబ్ కలెక్టర్ సేతు మాధవన్ అక్కడి రెవెన్యూ అధికారులతో



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బాధిత రైతులు

ఫోన్‌లో మాట్లాడారు. తప్పులు చేస్తే ఎవరినీ వదిలేది లేదని హెచ్చరించారు. బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

అర్ధవీడు మండలంలోని అంకభూపాలెంలో అసైన్డ్ భూమి విస్తారంగా ఉంది. 1980 నుంచి అక్కడి ప్రజలు అసైన్డ్ భూముల్లో వ్యవసాయం ప్రారంభించారు. అప్పటి సాగుదారుల కుటుంబ సభ్యులు కూడా వారసత్వంగా నేటికీ సాగుబడిలో ఉన్నారు. ఏటా భూముల విలువ పెరుగుతున్నందున ప్రాంతం కాని వారంతా మారుమూల ప్రాంతమైన అర్ధవీడు మండలంలో ప్రభుత్వ భూములను కాజేసేందుకు పన్నాగం పన్నారు. రెవెన్యూ అధికారులను ముడుపులతో బుట్టలో వేసుకుని అక్రమంగా ఆన్‌లైన్‌లో హక్కులు కల్పించుకుంటున్నారు. ఆ తరువాత పట్టాదారు పాస్ పుస్తకాలు కూడా సంపాదిస్తున్నారు. జిల్లాలో దాటి ఏలూరు ప్రాంతంలోని కొందరు పెద్దలు ఇక్కడ సుమారు 200 ఎకరాల వరకు అక్రమంగా అర్ధవీడు మండలంలో భూములు సంపాదించారు. అధికారులు పెద్ద ఎత్తున ధనార్జన మూటగట్టుకున్నట్లు తెలిసింది.

ఈ క్రమంలోనే అంకభూపాలెం ▶ 2లో

హౌసింగ్ డిఇఇ ఇళ్లపై

ఏసీబీ సోదాలు

- భారీగా అక్రమాస్తుల గుర్తింపు
- అరెస్టు చేసి నెల్లూరు ఎసిబి కోర్టుకు తరలింపు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్, చీరాల, మేదరమెట్ల

ఆదాయానికి మించి ఆసులు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో గుంటూరు హౌసింగ్ కార్పొరేషన్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న చుంచు ఆంజనేయులు ఇళ్లపై ఎసిబి అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో భారీగా ఇళ్లు, ఇళ్లస్థలాలు, పొలాల డాక్యుమెంట్లు, బంగారం, వెండిని స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల అనంతరం ఒంగోలు ఎసిబి డిఎస్‌పి వల్లూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర డిజిపి, ఎసిబి డిజి రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాలు, పలువురు నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు గుంటూరు హౌసింగ్ కార్పొరేషన్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చుంచు ఆంజనేయులుకు చెందిన ఇళ్లు, బంధువుల ఇళ్లలో దాడులు నిర్వహించామన్నారు. ఐదు చోట్ల ఒంగోలు,



నగలు, ఆస్తి పత్రాలతో చుంచు ఆంజనేయులు

చీరాల, దైవాలరావూరు, దేవరంపాడు, మేదరమెట్లలో దాడులు జరిగాయని, తమ విచారణలో భారీగా అక్రమాస్తులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఒంగోలులో జిప్లస్ 3 హౌసింగ్ కాంప్లెక్స్, 1 ప్లాట్, కొప్పోలులో 8 స్థలాలు గుర్తించామన్నారు. చీరాలలో నిర్మాణం పూర్తయిన ఒక ఇల్లు, 2 స్థలాలు, రూ.53 లక్షలతో కడవకుదురులో కొనుగోలుగా ఉన్న 1.09 ఎకరాల స్థలం డాక్యుమెంట్లు గుర్తించామన్నారు. బ్యాంకు ▶ 2లో

ఇక 'జగనన్న సురక్ష' పేరుతో..

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వడం తప్ప ఒరిగిందేమీ లేదు. నిషేధిత జాబితాల్లో భూములను చేర్చారు. వివిధ కారణాలతో రైతుల సాగుచేసుకునే వాటిని కూడా పెట్టారు. పట్టణాల్లో ఇల్లు కట్టుకొని ఇరవై ఏళ్ల నుంచీ ఉన్న వాటిని కూడా చేర్చారు. వీటి వల్ల జనం చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న ఆస్తులు అవసరాలకు వినియోగంలో లేకుండా పోయాయి. అమ్ముకోవాలన్నా సాధ్యం కావడం లేదు. రిజిస్ట్రేషన్లు చేయడం లేదు. బ్యాంకుల్లో రుణాలు ఇవ్వడం లేదు. మంగమూరు రోడ్డులోని విలువైన అపార్టుమెంట్లు ఉన్న సర్వేనెంబర్లు కొన్ని నిషేదిత జాబితాలో చేర్చారు. వాటి వల్ల అమ్మకాలు తర్వాత సంగతి బ్యాంకుల్లో పిల్లలకు విద్యా రుణాలు కూడా ఇవ్వడం లేదు. 22ఏ కింద చేర్చిన భూములకు మోక్షం కలగడం లేదు. వాటిని తొలగించుకునేందుకు జనం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. రెవెన్యూ అధికారులు మండల స్థాయి నుంచీ కలెక్టర్ వరకూ ఫైలు పంపాలి. ఎక్కడా పనులు సజావుగా సాగడం లేదు. ఈ తరహా ఫైళ్లు కుప్పలుతెప్పలుగానే కార్యాలయాల్లో పేరుకుపోయాయి. ఇలాంటి వాటిని అధికారులు జగనన్న సురక్షపథకంలో పరిష్కారం చేయాల్సి ఉంది. వీటిని చేస్తే స్పందన కార్యక్రమాలకు మూడొంతుల అర్జీలు తగ్గుతాయి. అనేక రకాల భూ సమస్యలు ఇపుడు ప్రధానంగా గ్రామాల్లో ఉన్నాయి. వాటిపై దృష్టిపెడతారా? లేదా? అనేదీ చూడాలి. సంక్షేమ పథకాలు కూడా సవాలక్ష సమస్యలతో చాలా మందికి ఆగాయి. కోతలు మొదలయ్యాయి. ఏదేమైనా సురక్ష పేరుతో మళ్లీ జనంలోకి వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది తిరిగే కార్యక్రమం మొదలుకానుంది. ప్రజలు నిజంగా ఎదుర్కొనే సమస్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

'ఏలూరు' పెద్దలకే అధికారుల అండ.!

(మొదటిపేజీ తరువాయి)

గ్రామంలోని సర్వే నెంబర్లు 775/2, 776/3, 775/1, 777/2, 778/2, 777/3, 778/1, 771/1, 772/3లో ప్రభుత్వ భూమిని కూడా తమదేనని హక్కులు సంపాదించారు. పైన పేర్కొన్న భూముల్లో 1980 నుంచి ఆ గ్రామంలోని భూమి లేని పేదలు సాగులో ఉన్నారు. జి.పుల్లారెడ్డి, యు.వెంకటసుబ్బయ్య, తోట శీలవతమ్మ, తోట రామమూర్తి, తోట క్రిష్ణమూర్తి, పసుపులేటి బాలయ్య, జి.పుల్లారెడ్డి తదితరులు నేటికీ సాగులో ఉన్నారు. పేద రైతులు పంటలు సాగు చేసుకోగా... దిగుబడి వచ్చే సమయంలో గడ్డి మందులు దుండలు పిచికారి చేయడంతో ఏటా సాగుదారులు నష్టాల్లో మునుగుతున్నారు. ఇంతటి దారుణం జరుగుతున్నా అక్కడి అధికారులు, పోలీసులు అక్రమంగా భూమి కొట్టేయాలని చూస్తున్న పెద్దల పక్షాన నిలబడుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే... శిక్షిస్తామని బెదిరింపులకు దిగడం జరుగుతోంది. తాజాగా శుక్రవారం మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్‌కు అక్కడ జరుగుతున్న అక్రమాలను వివరించేందుకు రాగా... తిరిగి ఇంటికి చేరుకునేసరికి పేదలు సాగు చేసుకున్న పంట పొలాలను దున్ని నష్టపరిచారు. వరస నష్టాలతో ఏమి చేయాలో తెలియక ఏ ఆధారమూ లేని పేదలు బిక్కుమంటూ జీవనం గడుపుతున్నారు. అంకభూపాలెంలో గ్రామంలో జరుగుతున్న భూ దందాపై సమగ్ర విచారణ జరపాలని, సాగులోని రైతులకు న్యాయం చేయాలని, అక్రమార్కుల భరతం పట్టాలని బాధితులు వేడుకుంటున్నారు.

నిందితులపై 'అట్రాసిటీ' కేసు

(మొదటిపేజీ తరువాయి)

చొరవచేసి గాయపడిన వారికి మెరుగైన వైద్యం చేయించాలన్నారు. భూమి కొనుగోలు పథకం కింద ఎకరం భూమి ఇవ్వాలన్నారు. భార్యాభర్తలిద్దరికీ అట్రాసిటీ యాక్ట్ ప్రకారం నష్ట పరిహారం వెంటనే చెల్లించి.. కుటుంబానికి రక్షణ కల్పించాలన్నారు. కౌలు వ్యవసాయానికి అడ్డంకులు లేకుండా రెవెన్యూ, పోలీస్ శాఖలు ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు జిల్లా నాయకులు టి కృష్ణమోహన్, సిహెచ్ ముజుందార్, బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరరావు, బీఎస్పీ ఇన్‌ఛార్జి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏసీబీ దాడులు

(మొదటిపేజీ తరువాయి)

లాకర్‌లలో కిలో బంగారం, 2 కార్లు, 2 మోటార్ సైకిళ్ళు, 6 కిలోల వెండి ఉన్నట్లు గుర్తించామని, వీటి విలువ రూ.2,81,65,000గా డాక్యుమెంట్ విలువగా తేల్చామన్నారు. బహిరంగ మార్కెట్‌లో ఈ ఆస్తుల మరింత ఎక్కువ ఉంటుందని అంచనా వేస్తున్నామన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ డిఇఇ చుంచు ఆంజనేయులును అరెస్టు చేసి నెల్లూరు ఎసిబి కోర్టులో హాజరుపరుస్తామన్నారు. ఈ దాడులలో నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఎసిబి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జవహర్ నవోదయకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-పెద్దారవీడు



పెద్దారవీడు మండలంలోని ఓబులక్కపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థి వెన్నా హర్షమోహన్‌రెడ్డి నవోదయలో 6వ తరగతి ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాడు. ఆ విద్యార్థిని ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, విద్యా వాలంటీర్ హనుమంతు అభినందించారు.

స్కూల్ బస్సు కింద పడిన విద్యార్థిని

ప్రజాశక్తి-సింగరాయకొండ

సింగరాయకొండ మండలం మూల గుంటపాడులో ఉన్న భాష్యం పాఠశాల బస్సు కిందపడి అదే పాఠశాల చదువుతున్న విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారంనాడు పాఠశాల మధ్యాహ్నం వరకే నిర్వహించడంతో 12:30 గంటలకు రెండో తరగతి చదువుతున్న మద్దాలి సంజన అనే విద్యార్థిని మూలగుంటపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ వద్దకు స్కూలు బస్సులోనే వెళ్లింది. రోడ్డుమీద దిగి ఇంటికి వెళ్ళాల్సి ఉండగా కొంతమంది విద్యార్థినులు విద్యార్థులు బస్సు వెనకవైపుకు వెళ్ళగా సంజనా అనే విద్యార్థిని బస్సు ముందువైపుకు వెళ్లింది. అందరు విద్యార్థులు వెనకవైపుకు వెళ్లారని భాష్యం స్కూలు బస్సు డ్రైవర్ బస్సును ముందుకు పోనివ్వగా ఆ బస్సు కింద విద్యార్థిని సంజన పడిపోయింది. వెంటనే అందరు విద్యార్థినులు కేకలు వేయటంతో బస్సును ఆపగా బస్సు ముందు వైపున ఢీకొనడంతో విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటానా స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తీసుకురాగా అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించారు. కాలు విరిగిందని వైద్యులు చెప్పడంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. ఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి స్కూలు బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రెండో తరగతి చదువుతున్న విద్యార్థిని మద్దాలి సంజన కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్దకు చేరుకొని పాఠశాల ప్రారంభంలోనే ఇలా జరగటంతో తల్లడిల్లిపోయారు.



చికిత్స పొందుతున్న చిన్నారి

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి-నిజాంపట్నం

నిజాంపట్నం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న 2009 బ్యాచ్‌కు చెందిన మోపిదేవి చలపతిరావు లివర్ సమస్యతో బాధపడుతూ మణిపాల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మరణించారు. నిజాంపట్నం గ్రామానికి చెందిన చలపతిరావు రేపల్లె పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించవలసి ఉండగా అతని ఆరోగ్య సమస్యను దృష్టిలో ఉంచుకునే ఉన్నత అధికారుల ఆదేశాలతో రేపల్లె పోలీస్ స్టేషన్ నుంచి అటాచ్మెంట్‌పై నిజాంపట్నం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అతని మృతిపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సంతాపం తెలియజేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన కుటుంబానికి పోలీస్ శాఖ అండగా ఉంటుందని, శాఖాపరంగా కుటుంబానికి రావాల్సిన అన్ని రకాల పరిహారాలు, రాయితీలు సకాలంలో అందించడానికి కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు. శోకసంద్రంలో ఉన్న చలపతిరావు కుటుంబ సభ్యులను పరామర్శించి పోలీస్ శాఖ అధికార లాంఛనాలతో పార్థివ దేహానికి అంత్యక్రియలు నిర్వహించాలని నిజాంపట్నం పోలీస్ స్టేషన్ ఎస్ఐ రమేష్‌ను జిల్లా ఎస్పీ ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చలపతిరావు పార్థివ దేహానికి పోలీస్ అధికారులు పూలమాల వేసి ఘన నివాళి అర్పించింది. మట్టి ఖర్చుల నిమిత్తం అతని సతీమణికి రూ.25 వేలను ఎస్ఐ రమేష్ అందజేశారు. అనంతరం నిజాంపట్నం హిందూ శ్మశాన వాటికలో పోలీస్ శాఖ అధికార లాంఛనాలతో చలపతిరావు పార్థివ దేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.



కానిస్టేబుల్‌కు అంతిమ వీడ్కోలు

రేషన్ డీలర్ల మహాసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-చెరుకుపల్లి

జూలై 23వ తేదీన విజయవాడలో నిర్వహించే రాష్ట్ర రేషన్ డీలర్ల మహాసభను విజయవంతం చేయాలని రాష్ట్ర రేషన్ డీలర్ల అసోసియేషన్ కార్యదర్శి రావూరి శివ నాగేశ్వరరావు, బాపట్ల జిల్లా అధ్యక్షుడు టి రవిచంద్రరెడ్డి పిలుపునిచ్చారు. రేపల్లె డివిజన్ పరిధిలోని 9 మండలాల రేషన్ డీలర్ల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కారం నిమిత్తం పౌర సరఫరాల వ్యవస్థలో డీలర్ల ఉనికిని కాపాడుకోవడం కోసం ఐక్యతను నిరూపించుకోవడం కోసం నిర్వహించిన రేషన్ డీలర్ల నాయకుల సమావేశంలో రేపల్లె డివిజన్ నుంచి ప్రతి ఒక్క రేషన్ డీలర్ ఈ మహాసభకు హాజరవడానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో బావనయ్య, రామకోటేశ్వరరావు, విజయలక్ష్మి, పలువురు రేషన్ డీలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో నాణ్యమైన సేవలు: ఎంపిపి

ప్రజాశక్తి-కొమరోలు

ప్రకాశం జిల్లా కొమరోలు మండలం ప్రభుత్వ వైద్యశాలలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎంపిపి కామూరి అమూల్య తెలిపారు. కొమరోలు పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య సిబ్బందితో సమావేశమై వైద్యశాల అభివృద్ధిపై చర్చించారు.

జగనన్న సురక్షపై సమీక్ష ప్రారంభం

ప్రజాశక్తి-అర్ధవీడు

ఈరోజు జగనన్న సురక్ష సమీక్ష వీడియో కాన్ఫరెన్స్ ఎంపీడీవో కార్యాలయంలో వెలిగొండ ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారి ఎం రామసుబ్బయ్య మరియు ఎంపీడీవో ఎన్ జగదీష్ ఇన్‌ఛార్జి ఎమ్మార్వో ఎల్ వెంకటేశ్వర్లు, రీసర్వే డ్యూటీ నాయబ్ రసూల్ ఈవోపీఆర్డి ఆంజనేయులు, మండల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలం గౌతవరం ఎంపియుపి స్కూల్‌లో కీర్తిశేషులు డాక్టర్ సత్యనారాయణ ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ జ్ఞాపకార్థం వారి ధర్మపత్ని భవాని ఆర్థిక సహాయ సహకారాలతో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బిఎస్ నారాయణరెడ్డి విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు సహాయం అందించే దాతల సహకారం మరువలేనిదని, భవిష్యత్తును తీర్చిదిద్దగలిగే శక్తి ఒక్క ఉపాధ్యాయులకు మాత్రమే ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్ని ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వ్యవస్థాపకులు మాగులూరి శ్రీకాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాశయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా సుజన్

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండల నూతన తహశీల్దార్‌గా సుజన్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు ఆయన నెల్లూరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఉన్న తహశీల్దార్ అశోక్ కుమార్ రెడ్డి సెలవుపై వెళ్లారు. తదుపరి బదిలీపై పొదిలి వెళ్లారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి తహశీల్దార్‌గా డిప్యూటీ తహశీల్దారు ఎన్ జయలక్ష్మి పనిచేశారు. నూతన తహశీల్దారు రావడంతో తిరిగి ఆమె తన విధుల్లోకి వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సుజన్ కుమార్ స్థానిక శాసనసభ్యులు టిజెఆర్ సుధాకర్ బాబును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఎస్ఐగా పులి శివనాగరాజు

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

హనుమంతునిపాడు ఎస్ఐగా పులి శివనాగరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఒంగోలు వివిఆర్ నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా హనుమంతునిపాడు ఎస్ఐగా వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ కృష్ణ పావని రాచర్ల ఎస్ఐగా బదిలీపై వెళ్లారు.

గ్రామ వాలంటీర్ ఆత్మహత్య

ప్రజాశక్తి-కర్లపాలెం

కర్లపాలెం మండలం పెదగొల్లపాలెం పంచాయతీ మరకవారిపాలేనికి చెందిన గ్రామ వాలంటీర్ మరక రాజేష్ తెల్లవారుజామున సుమారు 2గంటల సమయంలో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని తండ్రి వెంకటేశ్వర్లు కర్లపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని కర్లపాలెం ఎస్ఐ శివయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజేష్ 22వ తేదీ రాత్రి భోజనాల కోసం కర్లపాలెం వెళ్లి రాత్రి 11.30 గంటలకు తిరిగి ఇంటికి వచ్చాడని, తెల్లవారుజామున సుమారు 2గంటల సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. పిఎంఆ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. కేసును పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

లక్కవరంలో వ్యక్తిపై కత్తితో దాడి

- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

ప్రజాశక్తి-దరిశి

తాళ్లూరు మండలం లక్కవరం గ్రామంలో కుటుంబ కలహాలతో తూము వెంకటసుబ్బారెడ్డి అనే వ్యక్తిని పేరం వెంకటేశ్వరరెడ్డి కత్తితో దాడి చేసి గాయపరిచాడు. పేరం వెంకటేశ్వరరెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. పేరం వెంకటేశ్వరరెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ విదేశాలకు వెళ్లాలంటే తూము వెంకటసుబ్బారెడ్డి అడ్డుపడుతున్నాడని అతనిపై కోపం పెంచుకుని దాడి చేసినట్లు ఎస్ఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. కత్తితో వెంకటసుబ్బారెడ్డిని రెండు పోట్లు పొడవడంతో అక్కడ ఉన్నవారు అడ్డుకుని తప్పించారన్నారు. అనంతరం గాయపడిన వెంకట సుబ్బారెడ్డిని దరిశి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అతనికి ఎలాంటి ప్రాణహాని లేదని తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రతి ఒక్కరికీ పథకాలు: ఎంపిపి

ప్రజాశక్తి-మద్దిపాడు

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలని ఎంపిపి వాకా అరుణ కోటిరెడ్డి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై శుక్రవారం సీఎం జగన్ జిల్లా కలెక్టర్లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంపిపి స్థానిక అధికారులతో మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సర్టిఫికెట్లు లబ్ధిదారులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తహశీల్దారు రజని, వైసిపి మండల కన్వీనర్ అప్పారావు, బత్తుల శీను, కో-ఆప్షన్ నెంబర్ మాస, రవి, రామాంజనేయులు, ప్రభాకర్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి-పిసిపల్లి: ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేసి పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు కోరారు. పిసిపల్లి ఎంపిడిఓ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ అధ్యక్షుడు అత్యాల ఈసా అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసే కుట్రను ప్రజలు చైతన్యవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రెండు పూటలా పని పద్ధతి, సమ్మర్ అలవెన్స్ ఇవ్వకపోవడం, పనిముట్లు బాడుగలు, మంచినీళ్లు, మజ్జిగ, ఆటో పని ప్రదేశంలో మౌలిక వసతులు, మెడికల్ కిట్ లాంటివి తొలగించడం ద్వారా ఉపాధి కూలీలకు ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు. కరోనా సమయంలో దేశవ్యాప్తంగా పేదలను ఆకలి చావుల నుంచి ఆదుకున్నటువంటి ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్ కేటాయింపుల్లో కోతలు పెడుతూ వస్తోందన్నారు. 2021లో లక్ష ఇరవై వేల కోట్లు కేటాయించగా 2022లో 90 వేల కోట్లు కేటాయించగా 2023 నాటికి 60,000 కోట్లకు కుదించారని అన్నారు. ఇది పారిశ్రామికవేత్తలకు దోపిడీదారులకు దోచిపెట్టే ప్రభుత్వం తప్ప ప్రజాప్రభుత్వం కాదని అన్నారు. ప్రతి జాబ్ కార్డు దారునికి 200 రోజులు పని కల్పించాలని, రోజుకు రూ.600 రూపాయలు తగ్గకుండా కూలి ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు పి మహేష్ మాట్లాడారు. అనంతరం వినతి పత్రాన్ని స్థానిక ఎంపిడిఓ కె శ్రీనివాస్‌రెడ్డికి అందించారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బడుగు జనార్దన్, జిల్లా నాయకులు బడుగు వెంకటేశ్వర్లు, అత్యాల ఇసాక్, కార్యదర్శి బడుగు వెంకటేశ్వర్లు, వున్నం చెన్నయ్య, కూలీలు, మెట్లు తదితరులు పాల్గొన్నారు.



సివిల్స్ ర్యాంకర్ లక్ష్మీ సుజిత ను అభినందిస్తున్న సీఎం జగన్

లక్ష్మీ సుజితకు సీఎం అభినందనలు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

సివిల్స్ ఫలితాల్లో 311వ ర్యాంక్ సాధించిన వీరగంధం లక్ష్మీ సుజితను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ముందుండి మంచి పరిపాలనలో భాగస్వాములై ప్రజాపాలనలో తనదైన ముద్ర వేయాలని ఆకాంక్షించారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇటీవల విడుదల చేసిన సివిల్స్ ఫలితాల్లో మార్టూరుకు చెందిన శ్రీ శ్రీనివాస విద్యాసంస్థల అధినేత వీరగంధం శ్రీనివాస్, భవాని దంపతుల కుమార్తె లక్ష్మీ సుజిత జాతీయ స్థాయిలో 311వ ర్యాంక్ సాధించడం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర ప్రతిష్టను పెంచేలా కృషి చేయాలని సీఎం కోరారు.



కలెక్టర్‌తో సమావేశమైన బిసి నాయకులు

అమర్నాథ్ కుటుంబానికి ఇచ్చిన హామీలు నెరవేర్చండి

ప్రజాశక్తి-బాపట్ల

చెరుకుపల్లి మండలం ఉప్పాలవారి గ్రామంలో జరిగిన సంఘటన జిల్లాలో మరోసారి పునరావృతం కాకుండా చూడాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రంజిత్ బాషాను, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ వకూల్ జిందాల్‌ను ఆయన కలిశారు. చెరుకుపల్లి మండలం ఉప్పాలవారిపాలెంలో జరిగిన సంఘటన చాలా బాధను మిగిల్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థి అమర్‌నాథ్ గౌడ్‌ను దారికాసి హతమార్చడం దుర్మార్గమన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులో దోషులను వేగంగా శిక్షించాలని ఆయన కోరారు. నేరానికి పురిగొల్పిన వారిని దోషులుగా నిర్ధారించి చార్జీషీట్‌లో వారి పేరును చేర్చాలని ఎస్పీని కోరారు. బాధిత కుటుంబానికి ఇస్తానన్న హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య, యువజన కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్రం ద్వారకా శ్రీను, బాపట్ల, వేమూరు నియోజవర్గాల అధ్యక్షులు పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, మురాల వాసుదేవ్, జిల్లా న్యాయ సలహాదారుడు నటరాజన్, జిల్లా కార్యదర్శి మారం రవికుమార్, పట్టణ యువజన అధ్యక్షుడు ఉప్పలదిన్నె గోపీనాథ్, పట్టణ కార్యదర్శి భాను పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-చీరాల

శ్రీ గౌతమి డిగ్రీ కళాశాల వేదికగా చీరాల మరియు బాపట్ల పరిసర ప్రాంత నిరుద్యోగులకు ఈ నెల 25వ తారీఖున 30 కంపెనీలు 1000 మంది ఉద్యోగాలకు అవకాశాలు కల్పిస్తున్నాయని, దానిని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీ గౌతమి డిగ్రీ కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఎం వెంకటేశ్వర్లు ప్రకటనలో కోరారు. ఈ నెల 25 ఆదివారం నాడు చీరాల బాపట్ల పరిసర ప్రాంతాల్లోని నిరుద్యోగులకు బాసటగా ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నాం అన్నారు. డిగ్రీతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలే లక్ష్యంగా శ్రీగౌతమి కాలేజి, ఎన్సిసి అకాడెమీ సహ కారంతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్ మేళాకు హాజరయ్యే వారు వారి వివరాలను రిజిస్ట్రేషన్ లింక్, క్యూర్ కోడ్ ద్వారా నమోదు చేసుకోవచ్చని అన్నారు. కావున జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 79898 15997 నంబరును సంప్రదించాలన్నారు.

రైతులు, పేదల పట్ల

సిఎంకు చిత్తశుద్ధి లేదు

గుండ్లకమ్మ గేటు ఏర్పాటు చేయకపోవడంలో కుట్రకోణం ● రాష్ట్రాన్ని బీహార్ స్థాయికి దిగజార్చారు ● అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అద్దంకి/మద్దిపాడు

రైతులు, పేదల పట్ల సిఎం జగన్మోహన్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'భవిష్యత్తుకు గ్యారెంటీ' బస్సు యాత్ర కార్యక్రమం గత నాలుగు రోజులుగా బాపట్ల, చీరాల, పర్చూరు నియోజకవర్గాలలో జరిగింది. 5వ రోజు మార్టూరులో బయలుదేరి హైవే మీదుగా అద్దంకి నియోజకవర్గంలోని తిమ్మనపాలెం, ఆ తరువాత చేరుకుంది. అక్కడ టిడిపి శ్రేణులు ఘనస్వాగతం పలికారు. నాగులుప్పలపాడు రోడ్డులోని మహిళలు, వ్యాపారులు, పాదచారులకు భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రం అందించి తెలుగుదేశం పార్టీ అధికారంలో వచ్చిన వెంటనే మొదటి ప్రాధాన్యతగా చేపట్టే అంశాలను నేతలు వివరించారు. అలాగే చంద్రబాబు నాయుడు హయాంలో శంఖుస్థాపన చేసిన సంతనూతలపాడు నియోజకవర్గం మద్దిపాడు మండలం గ్రోత్ సెంటర్, మరియు తిమ్మనపాలెం నుంచి నాగులుప్పలపాడు వరకు 10 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన రోడ్డుపై సెల్ఫీ దిగారు, టీ స్టాల్ వద్ద టీ తాగుతూ స్థానికులతో మాట్లాడారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

మద్దిపాడు వద్ద భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం మరియు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ర్యాలీగా గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్దకు వెళ్లి ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా గొట్టిపాటి మీడియాతో మాట్లాడుతూ.. గుండ్లకమ్మ జలాశయ ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయి 15 నెలలు కావస్తున్నా నేటికీ గేట్లు అమర్చడం ఈ వైసిపి ప్రభుత్వానికి చేతకాలేదని విమర్శించారు. గేట్లు పెట్టకపోవడం వెనుక పెద్ద స్థాయిలో కుట్ర కోణం దాగి ఉందనే అనుమానం కలుగుతోందని అన్నారు. రైతులు, పేదల పట్ల ఈ ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి లేదని అన్నారు. ఒకప్పుడు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలతో పోటీపడే ఆంధ్రప్రదేశ్‌ను నేడు బీహార్ కంటే అధమ స్థాయికి తీసుకువచ్చారని, ఇది ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పరిపాలన వైఫల్యమని అన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమని, నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఈ రాష్ట్రాన్ని, మన ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తారని, ముఖ్యంగా ప్రాజెక్టు పరిధిలోని రైతాంగానికి, మత్స్యకారులకు పూర్వవైభవం తీసుకొస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, టిడిపి బాపట్ల పార్లమెంటు అధ్యక్షులు, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు, బాపట్ల పార్లమెంటు మాజీ సభ్యుడు శ్రీరాం మాల్యాద్రి, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్, బాపట్ల టిడిపి ఇన్‌ఛార్జ్ వేగశన నరేంద్రవర్మ, చీరాల ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

చర్యలు తీసుకోవాలని అధికారులకు సిఎం ఆదేశం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



వీక్షణ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులు

రాష్ట్రంలో అర్హత కలిగి మిగిలిపోయిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించ డానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారు లను ఆదేశించారు. శుక్రవారం ముఖ్యమంత్రి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 99 శాతం సంక్షేమ పథకాలను ప్రజలకు అందించామని, పొరపాటున మిగిలి పోయిన 1శాతం లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించడానికి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. రాష్ట్రంలో జూలై 1వ తేదీ నుంచి నాలుగు వారాలు పాటు మండల స్థాయి అధికారులు గ్రామ, వార్డు సచివాలయాలు పర్యటించి గ్రామసభలు నిర్వహించాలన్నారు. అర్హులైన పేదల నుంచి అర్జీలు తీసుకుని వాటిని పరిష్కరించి లబ్ధిదారులకు మేలుజరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి కోటి అరవై లక్షల కుటుంబాల లబ్ధిదారులను కలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా నుంచి రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కరణం వెంకటేష్, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎమ్మెల్సీ పోతుల సునీత, జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీ శివజ్యోతి, సిపిఓ భరత్ కుమార్, డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్, గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్, రవాణా శాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్లుయెంట్‌లో గుఱ్ఱపుడెక్క తొలగించాలి

ప్రజాశక్తి-భట్టిప్రోలు



కనగాల అప్లుయెంట్ కాలువను పరిశీలిస్తున్న మంత్రి నాగార్జున

'ప్రజాశక్తి'లో శుక్రవారం 'గుణపాఠం నేర్వరా' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం కదిలింది. భట్టిప్రోలులోని అద్దేపల్లి నుంచి ప్రారంభమయ్యే కనగాల అప్లుయెంట్ మురుగు కాలువ గుఱ్ఱపుడెక్కతో వందల ఎకరాల పొలాలు ముంపునకు గురౌతున్నాయని కథనం సారాంశం. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున మురుగు పారుదల శాఖ అధికారులు డ్రైన్‌ను పరిశీలించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన దృష్ట్యా తక్షణం గుఱ్ఱపుడెక్కను తొలగించి రైతులకు ఇబ్బంది లేనివిధంగా చూడాలని ఆ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. కాలువ పరిస్థితి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సమీప రైతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే వేమూరు నియోజకవర్గంలో ఎక్కడెక్కడ కాలువలు పూడిపోయి ఉన్నాయో పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు.

జగనన్న కాలనీలో మంత్రి పర్యటన

మురుగు కాలువను పరిశీలించిన అనంతరం మంత్రి నాగార్జున సమీపంలోని జగనన్న కాలనీని కూడా సందర్శించి మౌలిక వసతులపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా ఏర్పడిన కాలనీకి ఒకేసారి అన్ని వసతులు కల్పించటం సాధ్యం కాదని, ఒక్కొక్కటిగా అన్ని వసతులు కల్పిస్తామని అన్నారు. ఇప్పటికే విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించామని, రహదార్లు కూడా ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దారా రవికిరణ్మయి, చెన్నయ్య, జెడ్పిటిసి ఉదయ్ భాస్కరి బాలాజీ, నాయకులు వేల్పూరి చిన్నారి, అరుణ్ శాస్త్రి, పిచ్చయ్య శాస్త్రి, ఉప సర్పంచ్ బుర్లే రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

రహదారుల వెంట చెట్లు..

రాత్రికిరాత్రే మాయం..

ఇది రియల్టర్ల పనే అంటున్న ప్రజలు

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలో ప్రధాన రహదారుల వెంట ఉన్న చెట్లు రాత్రికి రాత్రే మాయమైపోతున్నాయి. ఇది రియల్టర్ల పనేనని ప్రజలు భావిస్తున్నారు. ప్రధానంగా గుంటూరు-కర్నూలు రహదారికి ఇరువైపులా వినుకొండ నుంచి నరసరావుపేటకు వెళ్లే మార్గంలో రహదారికి ఆనుకొని ఉన్న భూములను రియల్ ఎస్టేట్‌దారులు కొనుగోలు చేసి భూమిని చదును చేసి ప్లాట్లుగా విభజించి అధిక ధరలకు అమ్మకాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్లాట్లకు అడ్డుగా ఉన్న రహదారి వెంట ఉన్న చెట్లను రాత్రికి రాత్రి తొలగిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణను కాపాడుకోవడానికి ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి రహదారుల వెంట చెట్లను పెంచుతుంటే, రియల్



సంతమాగులూరు-అడ్డరోడ్డు గ్రామాల మధ్యరహదారికి ఒకవైపు చెట్లను తొలగించిన దృశ్యం

ఎస్టేట్‌దారులు మాత్రం తమ ప్లాట్లకు అడ్డంకిగా ఉన్న చెట్లను మాత్రం ఎటువంటి అనుమతులు లేకుండా తొలగిస్తున్నారు. ఇంత దారుణం జరుగుతున్నా ఏ అధికారీ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. రహదారుల వెంట నడిచే పాదచారులు మాత్రం నిలువ నీడ లేకుండా చెట్లను తొలగిస్తున్నారని శాపనార్థాలు పెడుతున్నారు. సంతమాగులూరు మండలానికి నరసరావుపేట (పల్నాడు జిల్లా) కేవలం 15 కిలోమీటర్లు మాత్రమే ఉండటంతో రియల్టర్ల కన్ను ప్రధానంగా అడ్డరోడ్డు నుంచి నరసరావుపేట మధ్య రహదారి ఆనుకుని ఉన్న భూములపై కన్ను పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రహదారుల వెంట ఉన్న చెట్లను కాపాడాలని, చెట్లను తొలగించిన వారిపై కేసులు నమోదు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సురక్ష ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం

మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా నగరంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్లు నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. జగనన్న సురక్ష పథకాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం వీక్షణ పద్ధతిలో ప్రారంభించారు. ఈకార్యక్రమాన్ని మేయర్, డిప్యూటీ మేయర్‌లు, కమిషనర్, కార్పొరేటర్లు కార్పొరేషన్ కార్యాలయం నుంచి వీక్షించారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ మాట్లాడుతూ అర్హులై ఉండి, ఏదైనా కారణంతో వారికి ప్రభుత్వ పథకాలు అందక పోతే అలాంటి వారిని గుర్తించి వారికి కూడా సంక్షేమ పథకాలు అందించడమే ఈకార్యక్రమం ముఖ్యఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానంగా క్యాస్ట్, ఇన్‌కం, బర్త్ అండ్ డెత్, మ్యారేజ్, ఫ్యామిలీ, లావాదేవీల బదిలీ సర్టిఫికెట్లు జారీ, ఆధార్‌కు ఫోన్ నెంబర్ లింకు వంటి 11 రకాల సర్టిఫికెట్లు జారి చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమాన్ని జూలై 1 నుంచి ప్రారంభి నెలరోజులు పాటు సచివాలయ స్థాయిలో క్యాంపులు నిర్వహించి పథకాలకు అర్హులైన వారిని గుర్తించడం, సర్టిఫికెట్లు జారీ చేయడం జరుగుతోందన్నారు. వివిధ పథకాలలో అర్హులైన వారి వివరాలను ఆగష్టు 1వతేదిన ప్రకటిస్తామని తెలిపారు. ఈ క్యాంపులు ప్రారంభానికి ముందు వాలంటీర్లు అందరూ ఈనెల 24వతేది నుంచి వారి పరిధిలోని ఇళ్లకు వెళ్లి ప్రజా సమస్యలను గుర్తించడం జరుగుతోందన్నారు. జూలై 1 నుంచి జరిగే క్యాంపుల వివరాలు ఈపాటికే సచివాలయాలకు అందజేశామని తెలిపారు. క్యాంపుల నిర్వహణకు నగర పరిధిలో ఉన్న 70 సచివాలయాలకు సంబంధించి మూడు టీంలను ఏర్పాటు చేశామని వివరించారు. ఒక టీంకు కమిషనర్, రెండో టీంకు అసిస్టెంట్ కమిషనర్, మూడో టీంకు కార్పొరేషన్ ఇంజినీర్ నాయకత్వం వహిస్తారని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్‌లు వేమూరి బుజ్జి, వెలనాటి మాధవరావు, పలువురు కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం జగన్ తోనే సాధ్యం

వైసీపీ ఇన్చార్జి వరికూటి అశోక్‌బాబు

ప్రజాశక్తి-టంగుటూరు

నిరుపేదల సంక్షేమం సీఎం జగన్మోహన్ రెడ్డి తోనే సాధ్యమని కొండపి నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పొందూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వరికూటి అశోక్ బాబు మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు ఇంకా అనేక కొత్త పథకాలు కూడా ప్రజలకు చేరువ చేసిన ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి చరిత్ర సృష్టించాడన్నారు. సంక్షేమ పథకాలను ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే డబ్బులు పంపడంతో ప్రజలంతా ఆనందంగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు జన్మభూమి కమిటీలతో దోచుకుంటే ప్రస్తుత జగన్ పరిపాలన అవినీతి రహితంగా సాగుతుందని కొనియాడారు. అనంతరం పొందూరు పంచాయతీ పరిధిలోని లక్ష్మక్కపాలెం గ్రామంలోని గడప గడపకూ కార్యక్రమానికి కూలీలతో వెళుతున్న ట్రాక్టర్ ఎక్కి అశోక్ బాబు కూలీ మహిళలను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యేజర్ల పద్మ, వైసీపీ నాయకులు ఏలూరి వంశీకృష్ణ, పాపినేని వెంకటనారాయణ, మాజీ సర్పంచ్ మోంద్రు హనుమంతరావు, నాయకులు వాకా బాలకృష్ణారెడ్డి, మేదరమెట్ల భరత్ రెడ్డి, మొలకలపల్లి సీతారామయ్య, ఏఎంసీ డైరెక్టర్ టంగుటూరి రామకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దారే లేదు..ఇల్లెలా కట్టాలి సారూ.!

అధికారులతో హౌసింగ్ లబ్ధిదారుల ఏకరువు

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రజలకు పనికిరాని ప్రాంతంలో ప్లాట్లిచ్చారు.. ఆ లే అవుట్ కు వెళ్లడానికి దారే లేదు.. నీటి సౌకర్యం అంతకన్నా లేదు. ఇల్లెలా కట్టాలి.. మీరే చెప్పండి సారూ.. అంటూ జగనన్న గృహ నిర్మాణ లబ్ధిదారులు అధికారులు ఎదుట ఏకరువు పెట్టారు. శుక్రవారం మండలంలోని కారుమంచి గ్రామంలో గృహ నిర్మాణాలపై సమీక్షించేందుకు వెళ్లిన అధికారులు హౌసింగ్ లబ్ధిదారుల వ్యాఖ్యలతో ఖంగుతున్నారు. జగనన్న నవరత్నాల పథకంలో భాగంగా కారుమంచి గ్రామంలో 98 మంది లబ్ధిదారులను గుర్తించి నివేసిన స్థలాల మంజూరు కోసం గ్రామ సమీపంలో లే అవుట్ వేశారు. 98 మంది లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించారు. అప్పటినుండి అధికారులు జగనన్న లే అవుట్ లో వసతుల కల్పనను పూర్తిగా విస్మరించారు. ఆ లే అవుట్ కు ఇప్పటికీ సరైన దారి లేదు. వర్షం వస్తే ఆ నడక బాట కూడా మాయమై లే అవుట్ అంతా బురదమయంగా ఉంటుందని గ్రామస్తులు గగ్గోలు పెడుతున్నారు. గహాలు



జగనన్న లే అవుట్ సమస్యలను అధికారులకు వివరిస్తున్న లబ్ధిదారు

నిర్మించుకొనని లబ్ధిదారుల ప్లాట్లను రద్దు చేస్తామని హెచ్చరించే ఉన్నతాధికారులు దీనికేం సమాధానం చెబుతారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. మౌలిక వసతులు లేకపోవడంతో తొలివిడతలో మంజూరైన 76 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేదు. దీంతో గృహ నిర్మాణ శాఖ ద్వారా మంజూరైన 76 గహాలను కూడా అధికారులు రద్దు చేశారు. మళ్లీ రెండో విడతలో 5 గహాలను అధికారులు మంజూరు చేశారు. ఈ ఐదింటిలో ఒక్క ఇల్లు మాత్రమే నిర్మాణం పూర్తయింది. మిగిలిన 4 గహాలు నిర్మాణ దశలో ఉన్నాయి. గ్రామంలో గృహ నిర్మాణాల సమీక్షకు వెళ్లిన అధికారులు లబ్ధిదారుల సమస్యలు విని అక్కడనుండి నిష్క్రమించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్పెషలాఫీసర్ బి.నారదముని, తహశీల్దార్ కొల్లిబోయిన సంజీవరావు, ఎంపీడీఓ పి రత్నజ్యోతి, హౌసింగ్ డీఈఈ పాటిబండ్ల జయరావు, పంచాయతీ కార్యదర్శి పి శ్యామ్ సుందర్, వెలుగు వీఓఏలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

వర్షపు నీరు రోడ్లపై ఆగకుండా చర్యలు

కమిషనర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

వర్షం వస్తే నగరంలో ప్రధాన ప్రాంతాల్లో ఉన్న రోడ్లపై ఎక్కడెక్కడ నీరు నిలుస్తుందో గుర్తించి, ఆయా ప్రాంతాల్లో మెరుగైన డ్రెయినేజీలు నిర్మించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. వర్షం వస్తే నీరు నిలిచే గాంధీరోడ్డు, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ ప్రాంతాలను డిప్యూటి మేయర్ వేమూరి బుజ్జితో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. గాంధీరోడ్డులో నీరు నిలబడటానికి గల కారణాలపై చర్చించి, అక్కడ కాల్వలను ఎలా అభివృద్ధి చేయాలనే విషయంపై ఇంజినీరింగ్ విభాగం అధికారులతో చర్చించారు. గాంధీరోడ్డులో ఉన్న కాల్వల్లో చెత్త పేరుకు పోయి, పూడికతో నిండి ఉన్నాయని, వెంటనే పూడిక తీత పనులు చేపడతామని కమిషనర్ తెలిపారు. గాంధీబొమ్మ నుంచి ట్రంకురోడ్డు వరకు కొత్తగా సిమెంటు రోడ్డు నిర్మించి, రోడ్డుకు ఇరువైపులా కొత్తగా డ్రెయినేజీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇందుకు సంబంధించి అంచనాలు తయారు చేయాలని



గాంధీనగర్‌లో డ్రైనేజ సమస్యను తెలుసుకుంటున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఇంజినీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. బాపూజీ కాంప్లెక్స్ ఎదురుగా బందిళ దొడ్డి వద్ద పాత డ్రెయినేజీ సామర్థ్యం తక్కువగా ఉందని, అది కేవలం మురుగునీరు పారేందుకే సరిపోతుందని, వర్షం వస్తే సామర్థ్యం చాలక నీరు రోడ్డుమీదకు వస్తుందని గుర్తించారు. అక్కడ పెద్ద డ్రెయినేజీ నిర్మించాలని నిర్ణయించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షం పడినప్పుడు నగరంలోని ప్రధాన రోడ్లమీదకు నీరు చేరకుండా డ్రెయినేజీల ద్వారా సాఫీగా పారే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. త్వరలోనే పలు ప్రాంతాల్లో డ్రెయినేజీల విస్తరణ, కొత్త డ్రెయినేజీల నిర్మాణ పనులు చేపడతామని చెప్పారు. కమిషనర్ వెంట కార్పొరేషన్ ఇంజినీర్ కె మాల్యాద్రి, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పద్మజా, రఘురాం, తదితరులు ఉన్నారు.

లీకు మరమ్మత్తుల పనులు పరిశీలన..

స్థానిక సంతపేట నాటు బాబురావు పార్కు వద్ద తాగునీటి పైప్‌లైన్ మీద భారీ లీకు ఏర్పడింది. ఆలీకు మరమ్మత్తుల పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పనులను కార్పొరేషన్ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు, ఇంజినీర్ కె మల్యాద్రి, స్థానిక కార్పొరేటర్ ఇమ్రాన్ ఖాన్ పరిశీలించారు. మరమ్మత్తులు పనులు త్వరగా పూర్తి చేసి, పైప్‌లైన్‌ను పునరుద్ధరించాలని సిబ్బందిని ఆదేశించారు.

ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి: బాలినేని

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని తిరుమలలోని వెంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్లు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం వేకువ జామున ఆయన దంపత సమేతంగా వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామి వస్త్రం సేవలో పాల్గొన్నారు. బాలినేని దంపతులు తీసుకు వెళ్లిన వస్త్రాలను అర్చక పండితులు స్వామి వారికి వేదోక్తంగా సమర్పించారు. అనంతరం స్వామి వారి ఆలయ ఆవరణలో ఉన్న రంగనాయక మండపంలో బాలినేని దంపతులకు వేద పండితులు ఆశీర్వచనం చేశారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు



తిరుమలలో బాలినేని దంపతులు, దిల్ రాజు, కుటుంబసభ్యులు

అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల మీడియా మిత్రులు బాలినేని శ్రీనివాసరెడ్డిని పలుకరించారు. వారితో బాలినేని శ్రీనివాసరెడ్డి కాసేపు మాట్లాడారు. స్వామి వస్త్రం సేవ దొరకడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరికి ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు మరింత శక్తిని ఇవ్వాలని, సమృద్ధిగా వర్షాలు పడి రైతులు ఆనందంగా ఉండాలని స్వామి వారిని కోరుకున్నట్లు పేర్కొన్నారు. బాలినేని దంపతుల వెంట సినీ నిర్మాత దిల్ రాజు, ఆయన కుటుంబ సభ్యులు కూడా ఉన్నారు.

నవోదయ పాఠశాలకు 12 మంది ఎంపిక

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

పట్టణంలోని శ్రీ సాయి నవోదయ కోచింగ్ సెంటర్ విద్యార్థులు 12 మంది జవహర్ నవోదయ విద్యాలయ, కలుజువ్వలపాడుకు ఎంపికైనట్లు కోచింగ్ సెంటర్ నిర్వాహకురాలు పి.లక్ష్మీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవోదయలో సీటు సాధన

యర్రగొండపాలెం: ఇటీవల జరిగిన నవోదయ ఎంట్రన్స్ పరీక్షలలో యర్రగొండపాలెం మండలంలో అర్హత సాధించి అడ్మిషన్ పొందిన అతి కొద్ది మందిలో ఆర్ శివకిరనందన్ నాయక్ ఒకడిగా నిలిచాడు. ఈయన తండ్రి విజయ్ నాయక్ యర్రగొండపాలెంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల నందు అతిథి అధ్యాపకులుగా కామర్స్ విభాగంలో పనిచేస్తున్నారు. ఆయన కుమారుడు శివకిరనందన్ నాయక్ నవోదయలో సీటు సాధించడంతో ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ నాయుడుతో పాటు అధ్యాపకులు, అధ్యాపకేతర బందం అభినందించారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

సిద్ధవరం ఎంపి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులుగా గోనె శ్రీనివాసులు, బరిగె రామారావు పొదిలి మండలం సలకనూతలకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కెల్లంపల్లి నాసర్ మహమ్మద్ అధ్యక్షతన ఘన సన్మానం చేశారు. ముఖ్య అతిథులుగా ఎంఇఓ కె.డాంగేషరీఫ్, బరిగె నరసింహారావు, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు షేక్.అబ్దుల్‌హై హాజరయ్యారు. కార్యక్రమంలో మండల యూటీఎఫ్ అధ్యక్షుడు బి.కపారావు, ఎంఎన్ పి.శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

గానాల రామ్మూర్తికి ఘన నివాళి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

విశ్వకర్మ ముద్దుబిడ్డ శ్రీరావు సాహెబ్ గానాల రామ్మూర్తి 86వ వర్ధంతి సందర్భంగా యర్రగొండపాలెం మండల విశ్వబ్రాహ్మణ సంఘం కార్యాలయంలో శుక్రవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ బ్రాహ్మణ సంఘ ఉపాధ్యక్షులు ముత్తలూరి మల్లికార్జున చారి మాట్లాడుతూ గతంలో విశ్వబ్రాహ్మణులు ఓసీలుగా ఉండేవారని తెలిపారు. గానాల రామ్మూర్తి బ్రిటిష్ ప్రభుత్వంపై పోరాడి బీసీలుగా మార్చారని చెప్పారు. ముందుగా విశ్వకర్మ జాతిపిత రావు సాహెబ్ గానాల రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల విశ్వబ్రాహ్మణ సంఘ కన్వీనర్ జమ్మూజు వెంకటేశ్వర చారి, లింగాల సత్యనారాయణ చారి, గుంటూరు వెంకటాచారి, రంగోజు మల్లికార్జున చారి, బొద్దోజు బాలయోగి, జి సత్యనారాయణ, రామగిరి నారాయణ చారి, జై పరమేష్ ఆచారి పాల్గొన్నారు.

తహశీల్దార్ రవీంద్రారెడ్డికి ఘన సన్మానం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండల అడ్‌హక్ తహశీల్దార్‌గా ఇప్పటిదాకా పని చేసి శుక్రవారం యర్రగొండపాలెం మండల రెగ్యులర్ తహశీల్దార్‌గా భాధ్యతలు చేపట్టిన కర్నాటి రవీంద్రారెడ్డిని రెవెన్యూ సిబ్బంది పూల మాలలు, శాలువలు, బొకేలతో ఘనంగా సన్మానించారు. కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఉప్పలపాటి విజయ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ గోపాలుని ప్రసాద్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, మండల సర్వేయర్ సైదారావు, విఆర్‌ఓలు పోతులూరయ్యరెడ్డి, షేక్ నాసర్‌వలి, పాల్గొన్నారు.

కొనకనమిట్ల తహశీల్దార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కొనకనమిట్ల

కొనకనమిట్ల మండల తహశీల్దార్‌గా ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పిసిపల్లిలో పని చేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన తహశీల్దార్ ప్రవీణ్‌కుమార్ పిసిపల్లికి బదిలీపై వెళ్లారు. తహశీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు.

నవరత్నాలతో గడపగడపలో సంతోషం

ఎమ్మెల్యే కెపి నాగార్జున రెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

జగనన్న ప్రభుత్వ నవరత్నాల పథకాలతో ప్రతి పేద కుటుంబం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని ఇడుపూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి, నాయకులు కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. ముందుగా గ్రామంలో ప్రతి గడప గడపకు వెళ్లి ఎమ్మెల్యే కెపి నాగార్జునరెడ్డి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని లబ్ధిదారులకు వివరించి, నాలుగేండ్ల పాలనలో తమ ప్రభుత్వం అందించిన సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలను పంపిణీ చేశారు. ముందుగా ఎమ్మెల్యేను, నాయకులను గ్రామ సర్పంచ్ వెన్న మహేశ్వరి సుబ్బారెడ్డిలు శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపీడీవో నరసింహులు, ఏవో దేవి రెడ్డి శ్రీనివాసులు, జడ్పిటీసీ సభ్యులు నారు బాపన్‌రెడ్డి, ఎంపిపి పోరెడ్డి అరుణ, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, మాజీ జెడ్పిటిసి జవాజ రంగారెడ్డి, ఇడుపూరు మాజీ ఎంపిటిసి బట్టగిరి తిరుపతిరెడ్డి, ఇడుపూరు ఎంపిటీసీ కవలకుంట్ల పేతురు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

పనులు ఎందుకు చేయలేదు?

అధికారులపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

ప్రజాశక్తి- త్రిపురాంతకం

త్రిపురాంతకం మండల అధికారుల పని తీరుపై ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. త్రిపురాంతకం మండలంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం ఎంపిపి కోట్ల సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి అన్ని శాఖలకు చెందిన అధికారులు పాల్గొని వారు చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. అక్కడ వున్న కొందరు ప్రజాప్రతినిధులు అధికారులు చేసిన పనులు వివరించాలని కోరారు. గత సమావేశంలో తాము హామీ ఇచ్చిన పనులు చేయకపోవడంతో వారిపై అసహనం వ్యక్తం చేశారు. విద్యాశాఖ పై చర్చలో భాగంగా ఆళ్ళ ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస నగర్, గాంధీ నగర్ పాఠశాలలు శిధిలావస్థలో వున్నాయని అవి వర్షాలు పడితే కూలేవిధంగా ఉన్నాయని, జరిగే నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. అనంతరం ఉపాధి హామీ పనుల్లో అనేక అవకతవకలు జరిగినట్లు ఆయన ఆరోపించారు. అనేక మంది అధికారులు సమావేశాలకు హాజరు కావడం లేదని, వారిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వారిని ప్రశ్నించారు. అనంతరం యంపిడిఓ సాంబశివరావు మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి రాని అధికారుల నివేదికను పై అధికారులకు పంపిస్తానని చెప్పారు. వచ్చే సమావేశానికి అయిన వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యంపిపి కోట్ల సుబ్బారెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధికి అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఆళ్ల సుబ్బమ్మ, జడ్పీటిసి మాకం జాన్‌పాల్, వై పాలెం వైద్యశాల సూపరింటెండెంట్ శ్రీనివాస రావు, ఏఓ నీరజా, ఏపిఒ సుజాత, డాక్టర్ నాగేశ్వరరావు, కరున్ కుమార్, లక్ష్మీ దేవి, పిఆర్ ఏఈ, యనేస్పి ఏఈ పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

ధర్నాకు ఉపాధి కూలీలు తరలిరావాలి

ప్రజాశక్తి-కొండపి

ఈ నెల 24వ తేదీన ఒంగోలులో జరిగే కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాకు ఉపాధి కూలీలు భారిగా తరలి రావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కెజె మస్తాన్ పిలుపునిచ్చారు. శుక్రవారం నాడు కొండపి మండలంలోని చోడవరం, పెట్లూరు గ్రామాలలో ఉపాధి కూలీల పనిచేసే ప్రదేశాన్ని సందర్శించి.. ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఒంగోలు కలెక్టరేట్ దగ్గర జరిగే ధర్నాకు ఉపాధి కూలీలందరూ తరలిరావాలని కోరారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస నాయకులు

చైతన్య రథయాత్రను విజయవంతం చేయాలి

టీడీపీ ఇన్‌ఛార్జి ముత్తుముల

ప్రజాశక్తి-గిద్దలూరు

నియోజకవర్గంలోని కంభం మండలం, ఎల్.కోట గ్రామంలో శనివారం జరిగే భవిష్యత్తుకు గ్యారెంటీ ప్రచార కార్యక్రమంలో భాగంగా పార్టీ చేపట్టిన బస్సుయాత్ర, రచ్చబండ, పల్లెనిద్ర కార్యక్రమాలను విజయవంతం చేయాలని నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మ్యానిఫెస్టో ప్రచార కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ చేపట్టిన చైతన్య రథయాత్ర "బస్సుయాత్ర" కార్యక్రమం శనివారం సాయంత్రం 4.00 లకు ప్రారంభం అవుతుందని, ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మరియు జిల్లా నాయకులు పాల్గొంటారని అన్నారు. బేస్తవారిపేట మండలం, పెద్ద ఓబినేనిపల్లె గ్రామం నుండి బస్సుయాత్ర ప్రారంభం అయ్యి కంభం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, అక్కడి నుండి ఎల్. కోట గ్రామం చేరుకుంటారని అక్కడే సాయంత్రం 6 గంటలకు రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేసి మినీ మ్యానిఫెస్టో లోని అంశాలను తెలుగుదేశం నాయకులు ప్రజలకు వివరిస్తారని అన్నారు. రచ్చబండ అనంతరం గ్రామంలో తెలుగుదేశం రాష్ట్ర మరియు జిల్లా నాయకులు పల్లెనిద్ర చేస్తారన్నారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు సయ్యద్ శానేశావలి, ప్రధాన కార్యదర్శి పందీటి రజిని బాబు, పట్టణ కౌన్సిలర్లు బూనబోయిన చంద్రశేఖర్ యాదవ్, బిల్లా రమేష్ యాదవ్, నియోజకవర్గ ఎస్సి సెల్ అధ్యక్షులు గుర్రం దానియేలు, హెచ్. నరసింహులు, దూదేకుల హజరత్, సయ్యద్మియా, విష్ణు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారాయణ

'పూలసుబ్బయ్య'కు ఘన నివాళి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

నిరంతరం కరవుకాటకాలతో సతమతమవుతున్న పశ్చిమ ప్రకాశానికి ఆశాజ్యోతి అయిన వెలిగొండ ప్రాజెక్టు సాధన ద్వారానే కీర్తిశేషులు పూల సుబ్బయ్యకు నిజమైన నివాళి అర్పించినట్లని జిల్లా సిపిఐ కార్యదర్శి ఎంఎల్ నారాయణ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు, వెలిగొండ ప్రాజెక్టు ఉద్యమ నేత స్వర్గీయ పూల సుబ్బయ్య 36వ వర్ధంతి సభ శుక్రవారం ఉదయం నియోజకవర్గ పార్టీ కార్యదర్శి అందె నాసరయ్య అధ్యక్షతన పూల సుబ్బయ్య శాంతిభవన్లో జరిగింది. ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావుల పల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా పెద్ద ఎత్తున ఉద్యమించాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సభలో నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి అందె నా, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి షేక్ బాషా. సిపిఐ పట్టణ కార్యదర్శి పెద్దన్న, జనసేన పార్టీ కార్యదర్శి తిరుమలశెట్టి వీరయ్య, పూల సుబ్బయ్య కుమార్తెలు సుభాషిని, సునందినీ తదితరులు పాల్గొని పూల సుబ్బయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

ప్రజాశక్తి- రాచర్ల

రాచర్ల మండలంలో పలు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల షాపుల్లో వ్యవసాయ అధికారులు అంతర్గత తనిఖీ నిర్వహించారు. కనిగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు రమణ పలు షాపులు తనిఖీ చేసి లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లు,బిల్ బుక్కులు, ఇన్వైస్లు, ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు పరిశీలించారు. లైసెన్సు ఉన్న షాపు నందే రైతులు ఎరువులు, పురుగు మందులు, విత్తనములు కొనుగోలు చేయాలని, డీలర్ వద్ద నుండి బిల్లు పొందాలని రైతులను కోరారు. కార్యక్రమంలో రాచర్ల మండల వ్యవసాయ అధికారి షేక్ అబ్దుల్ రఫీక్, వ్యవసాయ విస్తరణ అధికారి బిసంపత్ కుమార్ పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మండలంలో పలు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల షాపుల్లో కనిగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు రమణ పలు షాపులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి విజయ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు, రాచర్ల మండల వ్యవసాధికారి షేక్ అబ్దుల్ రఫీక్ పాల్గొన్నారు.

తహశీల్దార్‌కి ఘన సన్మానం

ప్రజాశక్తి-పెద్ద దోర్నాల

పెద్దదోర్నాల మండల అడ్‌హక్ తహశీల్దార్‌గా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై తిరిగి పెద్దదోర్నాల తహశీల్దార్‌గా వేణుగోపాల్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా విఆర్ఏలు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యాకోబు, నాగేశ్వరావు, శ్రీను, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-శింగరాయకొండ

మండలంలోని బింగినపల్లి గ్రామంలో ఉన్న సచివాలయం వద్ద కాలువ రోడ్డు ఆక్రమణపై శుక్రవారం తహశీల్దార్ సిహెచ్.ఉషాకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గతంలో కాలువల నిర్మాణం చేసేటప్పుడు మాదిగపల్లికి వెళ్లే రోడ్డు బాగు చేయడం జరిగిందని, అయితే ఇప్పుడు సర్వేనెంబర్ 114, 115లో మాగాను భూమి నుంచి పోతూ ఉండేవాళ్ళని, ఎలాంటి అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ప్లాట్లు పెట్టి అమ్ముకోవడానికి సిద్ధమయ్యారని, ఆ సిద్ధం చేస్తున్న సమయంలో రోడ్డు ఆక్రమణకు గురి కావటం, కాలవలు పూడిపోవడం జరిగిందని చెప్పారు. రోడ్డుపై మురుగునీరు ఉండడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆ ప్రాంతంలోని ఉప్పు కొట్టూరుకి వెళ్లాలన్నా చిన్న వర్షానికి ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదు చేశారు. రోడ్డు ఆక్రమించిన రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

అర్హులకు పథకాలు అందించటమే లక్ష్యం

కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు, సేవలు అందించడమే లక్ష్యంగా "జగనన్న సురక్ష". కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జాయింట్ కలెక్టర్ కె. శ్రీనివాసులు, మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కొమ్మూరి కనకారావు, సూర్య బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి కరుణాకర్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, డిఆర్ఓ ఆర్. శ్రీలత, జడ్పీ సిఈఓ బి. జాలిరెడ్డి, సిపిఓ డి. వెంకటేశ్వర్లు, డిపిఒ జివి నారాయణ రెడ్డి, జిఎస్‌డబ్ల్యుఎస్. అధికారి ఉషారాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్.ఈ. మర్దన్ అలీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించేందుకు చర్యలు

ప్రకాశం-దరిశి

మండలంలోని ప్రధానోపాధ్యాయులు అందరు ప్రభుత్వ పాఠశాలలో విద్యాప్రమాణాలు పెంచి మెరుగైన విద్యను అందించాలని ఎంపిడిఒ కె కుసుమకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంఇఒలు కె. రఘురామయ్య, బి. రమాదేవి అధ్యక్షతన ప్రధానోపాధ్యాయులతో విద్యా ప్రమాణాలు పెంచేందుకు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించేందుకే 'సురక్ష'

ప్రజాశక్తి-కొండపి

గ్రామాలలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని స్త్రీశిశు సంక్షేమ శాఖ సంఘం చైర్మన్, జడ్పిటిసి మారెడ్డి అరుణ వెంకటాద్రిరెడ్డి, మండల ప్రత్యేక అధికారి అన్నపూర్ణ అన్నారు. శుక్రవారం నాడు మండల అభివృద్ధి కార్యాలయంలో జగనన్న సురక్ష ప్రారంభోత్సవ కార్యక్రమం వీడియో కాన్ఫరెన్సు ద్వారా వీక్షించారు. కార్యక్రమంలో తహశీల్దారు పి.సింగరావు, యంపిడివో రహనమూర్తి, పాల్గొన్నారు.

రైతుల మన్ననలు పొందిన ఏవో

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలంలో ఉండే రైతులు సమస్యలను వెంటనే పరిష్కరించి వారి మన్ననలను పొందిన వ్యక్తి వ్యవసాయ అధికారి వి.రాము అని సింగరాయకొండ ఏడిఏ ఈ నిర్మలకుమారి అన్నారు. శుక్రవారం నాడు బదిలీపై కందుకూరుకు వెళ్లిన ఏవో రాముకు వీడ్కోలు కార్యక్రమం శుక్రవారం నాడు కొండపి-1 రైతు భరోసా కేంద్రం వద్ద నిర్వహించారు. అనంతరం కొండపి పెర్టిలైజర్స్ డీలర్సు, విఏఏలు , సిబ్బంది శాలువాలతో, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కొండపి ఏవో విజయకుమార్, జరుగుమల్లి ఏవో యుగంధర్‌రెడ్డి, పొన్నలూరు ఏవో పూర్ణచంద్రరావు, కొండపి మండల విఏఏలు, పెర్టిలైజర్స్ డీలర్సు పాల్గొన్నారు.



ఆరోగ్య కేంద్రం పరిశీలనకు వచ్చిన అధికారులు

పట్టణ ఆరోగ్య కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి-ఒంగోలు

స్థానిక 39వ డివిజన్ పరిధిలోని పీర్లమాన్యం పట్టణ ఆరోగ్య కేంద్రంలో నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ అధికారులు తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో వసతులను పరిశీలించారు. వైద్యసేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్‌క్యుఎఎస్ స్టేట్ కన్సల్టెంట్ జ్యోతి, ఐఆసి కృష్ణప్రసాద్, ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వరుణ్‌తేజ పాల్గొన్నారు.

ప్రజాశక్తి 7
శనివారం 24 జూన్ 2023

టిక్కెట్ కోసం రాలేదు

విలేకరుల సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సజ్జా హేమలత

ప్రజాశక్తి-చీరాల

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రజలందరూ ఎదురుచూస్తున్నారని, తాను టిక్కెట్టు ఆశించి చీరాలకు రాలేదని, పార్టీ బలోపేతం కోసం జాతీయ కార్యదర్శి నారా లోకేష్ తనను చీరాలకు పంపించారని, టిడిపి కార్యక్రమాలు నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారని టిడిపి నాయకురాలు, పొన్నూరు మాజీ మున్సిపల్ చైర్మన్ సజ్జా హేమలత అన్నారు. స్థానిక లైఫ్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్‌లో ఆమె విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చీరాల పరిస్థితులను అడిగారన్నారు. చీరాలలో బీసీ వర్గాలు అధికంగా ఉండటంతో బీసీ సామాజిక వర్గానికి న్యాయం చేయాలని, అదేవిధంగా ప్రజలు ఎక్కువగా స్థానికంగా ఉండే నాయకులనే కోరుకుంటున్నారని గతంలో పోతుల సునీత, మరొకరు స్థానికులుగా కాకపోవడంతో ప్రజలు అసంతృప్తిగా ఉన్నట్లు తన సమాచారాన్ని తెలిపామని అన్నారు. స్థానిక నేతలకు అవకాశం కల్పిస్తే ప్రజల్లో నమ్మకం ఏర్పడి పార్టీ గెలుపునకు దోహదపడుతుందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని అన్నారు. తాను పొలిటికల్ ఫ్యామిలీ నుంచి వచ్చానని, గతంలో రెండు పర్యాయాలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సజ్జా హేమలత

ఎమ్మెల్యేగా సజ్జ చంద్రమౌళి పనిచేశారని, వదిన పన్నెం కస్తూరిబాయి కూడా వేటపాలెం జడ్పిటిసిగా సేవలు అందించారని అన్నారు. చీరాలతో తనకు ఎంతో అనుబంధం ఉందని, తమ బంధువులు అందరూ చీరాల ప్రాంతంలోనే ఉన్నారని, పలు పదవులలో ఆనాడు కొనసాగారని గుర్తు చేశారు. అయితే 2014లో తాను నియోజకవర్గంలో ఎమ్మెల్యే టికెట్ ఆశించానని, అయితే తమ అధినేత చంద్రబాబు పొన్నూరులో మున్సిపల్ చైర్మన్‌గా పోటీ చేయమని పంపించారని అన్నారు. 2019లోనూ చీరాల ప్రాంతానికి వచ్చానని, ఆనాటి పరిస్థితుల రీత్యా మౌనం వహించాల్సి వచ్చిందని అన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తనతో మాట్లాడారని, పార్టీ బలోపేతానికి చీరాలలో పనిచేయాలని సూచించారని అన్నారు. నియోజకవర్గంలో ఇన్‌ఛార్జిగా ఉన్న ఎంఎం కొండయ్యతో కలిసి పార్టీ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకువెళతానని పేర్కొన్నారు. అయితే పార్టీ సూచనల మేరకు తాను పనిచేస్తానని, టిక్కెట్ విషయం పార్టీ అధిష్టానం నిర్ణయిస్తుందని, ఆ నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని అన్నారు. తాను అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించానని, ట్రస్టు ద్వారా పేదలకు వైద్య సేవలు అందించడంతోపాటు పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో తెలుగుదేశం పట్ల మరింత మక్కువతో పని చేస్తానని ఆ దిశగానే చీరాల ప్రాంతంలో లైఫ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభించామని తెలిపారు. పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ చీరాల ప్రాంతవాసులతో నిత్యం కలిసి ఉంటూ పార్టీని ముందుకు తీసుకు వెళ్తానని ఆమె అన్నారు.

వ్యక్తికి రక్తదానం

ప్రాణాలు కాపాడిన 10 మంది యువకులు

ప్రజాశక్తి-పంగులూరు

తాము తలచుకుంటే ఏదైనా సాధించవచ్చని ఆ యువకులు నిరూపించారు. తీవ్రమైన రక్తహీనత వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రిలో ఉన్న యువకునికి పదిమంది యువకులు రక్తదానం చేసి ప్రాణాలు కాపాడారు. పంగులూరు మండలం లోని రామకూరు గ్రామం నాయి బ్రాహ్మణ కుటుంబానికి చెందిన మాచర్ల ప్రసాద్, తీవ్ర రక్తహీనత వ్యాధితో చిలకలూరిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనికి రక్తం ఎక్కించవలసిన పరిస్థితి ఏర్పడింది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అందుకు అనుకూలంగా లేవు. విషయం తెలుసుకున్న ఆ గ్రామానికి చెందిన పదిమంది యువకులు గుంటుపల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో మాచర్ల ప్రసాద్‌కు రక్తదానం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ సమయంలో వారి సొంత పనులను వాయిదా వేసుకుని ప్రసాద్‌కు రక్తదానం చేశారు. ప్రసాద్ ప్రాణాలను కాపాడారు. తమ కుటుంబ యజమానికి రక్తదానం చేసి ప్రాణాలు కాపాడిన యువకులకు ప్రసాద్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. వీరికి రామకూరు ట్రస్ట్ సభ్యులు కూడా కృతజ్ఞతలు తెలియజేశారు. యువకులు తలుచుకుంటే ఏమైనా చేయగలరని గ్రామస్తులు అభినందించారు.


రక్తదానం చేస్తున్న యువకుడు

చెరుకుపల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి-చెరుకుపల్లి

ఉప్పాల అమర్నాథ్ హత్య కేసులో నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా త్వరగా విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని సిపిఎం బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ మణిలాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉప్పాల అమర్నాథ్ మృతి నేపథ్యంలో నిందితులను ఫాస్ట్ ట్రాక్ ద్వారా కఠినంగా శిక్షించాలంటూ మండల పరిధిలోని బీసీ సంఘాలు, ప్రజాసంఘాల నేతృత్వంలో నిర్వహించిన బహిరంగ సభలో బాపట్ల జిల్లా సిపిఎం కమిటీ సభ్యులు మణిలాల్ మాట్లాడుతూ పోలీసులు కేసును తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరిస్తున్నారని, సాక్షాత్తు జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రెండు కుటుంబాల మధ్య తగాదా అని చెబుతున్నారని, కానీ వారి కుటుంబాల మధ్య ఎటువంటి గొడవలు లేవని, తన సోదరిని వేధించవద్దు అన్నందుకు అభం శుభం తెలియని పదో తరగతి విద్యార్థిని చేతులు కాళ్లు కట్టివేసి పాశవికంగా పెట్రోల్ పోసి హత్య చేయడం నేటి సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందని అన్నారు. ఇటువంటి దుర్మార్గమైన చర్యలు భవిష్యత్తులో జరగకుండా ఉండాలంటే నిందితులకు కఠినంగా అతి త్వరగా శిక్ష విధించాలని, జస్టిస్ వర్మ సిఫార్సుల మేరకు 45 రోజులలో విచారణ పూర్తి చేసి శిక్ష విధించాలని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు దివి రాంబాబు డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పీ మనోజ్ కుమార్, సిపిఎం చెరుకుపల్లి మండల కార్యదర్శి కే శరత్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, మీర్జా అజీముద్దీన్, కందుల వెంకటేశ్వరరావు తదితరులు, పలువురు బీసీ సంఘాల నేతలు, అమర్నాథ్ కుటుంబ సభ్యులు పలువురు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, రాజకీయ నాయకులు

నేడు సట్టు పోలేరమ్మ తిరునాళ్ల

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

మండలంలోని గుంటుపల్లి గ్రామంలో నేడు శనివారం సట్టు పోలేరమ్మ ద్వితీయ వార్షికోత్సవం నిర్వహిస్తున్నారని ఆలయ కమిటీ తెలిపారు. తిరుణాల సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాలు భారీ ఊరేగింపు, అమ్మవారికి భారీ ఎత్తున పొంగుల్లో, ఉదయం 11 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా గ్రామంలో వైసీపీ పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభ, తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఒక ప్రభ, కోలాటం, నిర్వహిస్తున్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి-చీరాల

పట్టణంలోని స్థానిక విఠల్ నగర్‌లో ఉన్న చైతన్య మనోవికాస కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు 2023-24 సంవత్సరానికి సంబంధించిన దరఖాస్తుల ఆహ్వానం నిర్వహిస్తున్నట్లు ఆ కేంద్రం డైరెక్టర్ ఎన్ వెంకన్నబాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మాటలు సరిగా రాని, మానసిక వైకల్యం ఉన్న, నడక సరిగా రాని పిల్లలు అర్హులు అన్నారు. ఇలాంటి ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణలో భాగంగా ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, సైకలాజికల్ కౌన్సెలింగ్, వృత్తి విద్యలను శిక్షణతో పాటు హాస్టల్ స్కాలర్ వసతి అందించనున్నట్లు తెలిపారు. ఏపీలో ఏ జిల్లాలో వారైనా దరఖాస్తులు చేసుకోవచ్చని అన్నారు. మరిన్ని వివరాలకు 9959131715, 9492127172 నెంబర్లను సంప్రదించాలని అన్నారు.

ప్రజా సంక్షేమమే జగన్ ఆశయం: మోపిదేవి

ప్రజాశక్తి-రేపల్లె

ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయమని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణరావు అన్నారు. మండలంలోని ఉప్పుడి గ్రామంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ మేరకు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను, ప్రజల అవసరాలను తెలుసుకున్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో జగన్మోహన్ రెడ్డికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు వైసిపి పట్టణ అధ్యక్షులు గడ్డం రాధాకృష్ణ మూర్తి, యువ నాయకులు మోపిదేవి రాజీవ్, మున్సిపల్ చైర్ పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్లు టివికె గుప్తా, ప్రశాంత్, నాయకులు బేతపూడి కోటేశ్వరరావు, అల్లంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


జగనన్న కాలనీలో పర్యటిస్తున్న టిడిపి నాయకులు సాయిబాబా

జగనన్న కాలనీ సమస్యలపై టిడిపి పరిశీలన

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ప్రభుత్వం పేదలకు కేటాయించిన నివేశన స్థలాలలో కనీస వసతులు లేక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్న దృష్ట్యా వాటిని పరిశీలించేందుకు శుక్రవారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి తునుగుంట్ల సాయిబాబా ఆధ్వర్యంలో బృందం పర్యటించింది. ఈ సందర్భంగా కాలనీలో పలువురు లబ్ధిదారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కనీస వసతులైన రహదార్లు, నీరు, విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నట్లు లబ్ధిదారులు సాయిబాబా ఎదుట వాపోయారు. ముందుగా జగనన్న కాలనీల పరిశీలనకు టిడిపి పిలుపునివ్వటంతో అధికారులు శుక్రవారం నీటిని పుష్కలంగా విడుదల చేయటం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుక్కల వెంకటేశ్వరరావు, అధిన బసవపున్నయ్య, సుధీర్, సయ్యద్ కలాం, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

భూ సమస్య పరిష్కారంతోనే పేదరిక నిర్మూలన

ప్రజాశక్తి-పంగులూరు

భారతదేశంలో భూ సమస్య పరిష్కారం అయితేనే పేదరికం అంతరించిపోతుందని, భూ సమస్య పరిష్కారం కాకుండా పేదరికం నిర్మూలించలేమని, కామ్రేడ్ రాయని వీరయ్య వర్ధంతి సభలో పాల్గొన్న పలువురు కమ్యూనిస్టు నాయకులు పేర్కొన్నారు. మండలంలోని చందలూరు గ్రామంలో గ్రామీణ పేదల సంఘం నాయకుడు, కామ్రేడ్ రాయని వీరయ్య 23వ వర్ధంతి సభ గురువారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో పలువురు కమ్యూనిస్టు నాయకులు పాల్గొని ప్రసంగించారు. సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్ పొలిట్ బ్యూరో సభ్యుడు మన్నవ హరిప్రసాద్ మాట్లాడుతూ, భారతదేశంలో భూ సమస్య పెద్ద సమస్య అని, స్వాతంత్ర్యానంతరం అనేకమంది భూస్వాముల నుంచి భూమిని విడిపించి పేదలకు పంచేందుకు కమ్యూనిస్టు పార్టీలు పోరాటాలు చేశాయని, ఇందులో అనేకమందిని కమ్యూనిస్టు యోధులను కోల్పోయామని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటిన, భూ సమస్య పరిష్కారం కాలేదని, ఇప్పుడు భూమిని


మాట్లాడుతున్న నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రాజ మోహన్ రావు

రైతుల దగ్గర నుంచి లాక్కునేందుకు పెద్దపెద్ద కార్పొరేట్ సంస్థలు ప్రయత్నాలు చేస్తున్నాయని, దానికి బిజెపి ప్రభుత్వం సహకరిస్తుందని అన్నారు. రైతుల దగ్గర ఉన్న భూములతో పాటు, సహజ వనరులు మొత్తం కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయని, వీటిని అడ్డుకోకపోతే భారత దేశ ప్రజానీకానికి మనుగడ లేదని అన్నారు. సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో భూమికోసం, పంటలకు గిట్టుబాటు ధరల కోసం, కూలి కోసం, సాగునీటి కోసం, వివక్షకు వ్యతిరేకంగా, అనేక పోరాటాలు చేశామని, ఆ పోరాట స్ఫూర్తి ఈ ప్రాంత ప్రజల్లో ఉందని, భవిష్యత్తులో జరిగే పోరాటాలకు కూడా ఈ ప్రాంత ప్రజలు అండగా నిలవాలని కోరారు. నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రాజమోహన్‌రావు మాట్లాడుతూ గ్రామీణ పేదల సంఘం నాయకుడు రాయని వీరయ్య ఈ ప్రాంతంలో అనేక పోరాటాల్లో పాల్గొన్నాడని, చివరిదాకా కమ్యూనిస్టు ఉద్యమంలోనే బ్రతికి ప్రాణాలు వదిలాడని అన్నారు. అంతకుముందు రాయని వీరయ్య స్మారకార్థం నిర్మించిన స్థూపం వద్ద ఆయనకు నివాళులర్పించి ఎర్రజెండా ఎగరవేశారు. ఈ సభకు గ్రామీణ పేదల సంఘం నాయకుడు అడే నీలాంబరం అధ్యక్షత వహించగా, సభలో సిపిఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, రైతు కూలీ సంఘం ప్రకాశం జిల్లా కార్యదర్శి లలిత కుమారి, ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్‌రావు, న్యూ డెమోక్రసీ నాయకులు హనుమంతరావు, మహమ్మద్ రఫీ, చందలూరు గ్రామం మాజీ సర్పంచి రాయిని కేశవరావు తదితరులు పాల్గొన్నారు. ప్రజా కళా మండలి కళాకారులు విప్లవ గీతాలు ఆలపించారు.

విధేయుడంటూనే... విమర్శలా.?

- బాధితులెవరో తీసుకురండి... న్యాయం చేద్దాం...
- వైసిపి ప్రతిష్టను దెబ్బతీయొద్దని...
- 'పెద్దిరెడ్డి'కి మున్సిపల్ చైర్మన్ 'చిర్లంచెర్ల' విజ్ఞప్తి


మాట్లాడుతున్న చిర్లంచెర్ల

ప్రజాశక్తి-మార్కాపురం

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్నానని చెప్పుకుంటున్న పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి... రాజకీయంగా పెద్దాయన, మాజీ ఎమ్మెల్యే కె.పి.కొండారెడ్డి కుటుంబానికి విధేయుడనని చెప్పుకుంటూనే... మరో వైపు ఆ కుటుంబంపై విమర్శలు చేయడం సబబు కాదని మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ హితవు పలికారు. మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ తన ఛాంబర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి వైసిపిలో కొనసాగుతూనే అధికార పార్టీకి చెందిన పెద్దాయన కె.పి.కుటుంబంపై బురదజల్లడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి, ఆయన సోదరుడు కష్ణమోహన్‌రెడ్డి బాధితులెవరైనా ఉంటే ఆధారాలతో మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదులు చేయించాలని, ఆ తరువాత న్యాయం చేస్తే బాగుంటుందని సూచించారు. ఇటీవల కాలంలో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు మార్కాపురం పర్యటనలో కూడా ఎమ్మెల్యే నాగార్జునరెడ్డిపై, సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేశారన్నారు. చంద్రబాబు ఆరోపణలపై మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి తీవ్రంగా స్పందించిన విషయాన్ని గుర్తు చేశారు. తప్పుచేస్తే తమ్ముడినైనా జైలుకు పంపేందుకు వెనుకాడబోనని ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి చెప్పిన విషయాన్ని ఉద్ఘాటించారు. పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి కర్నాటక ఓటరు అని అందరికీ తెలుసునన్నారు. వైసిపికి మార్కాపురం బలమైన స్థానం అన్నారు. చౌకబారు ఆరోపణలతో వైసిపి ప్రతిష్టను దెబ్బతీయొద్దంటూ మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ హితవు పలికారు. అర్థరహితమైన ఆరోపణలకు ఇక స్వస్తి పలకాలని పెద్దిరెడ్డికి విజ్ఞప్తి చేశారు.


28న జడ్పీ జనరల్ బాడీ సమావేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పాత జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 28న ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని జడ్పీ సిఇఒ బి.జాలిరెడ్డి తెలిపారు. సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. సమావేశానికి నిర్దేశించిన జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

మంత్రి సురేష్


మాట్లాడుతున్న మంత్రి సురేష్

ప్రజాశక్తి- త్రిపురాంతకం

సమస్యలు పరిష్కరించేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు గడప గడపకు వస్తున్నారని, పేదల అభ్యున్నతికి వైసీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పురపాలక పట్టనాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం గడప పడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని త్రిపురాంతకంలోని ఒకటో సచివాలయం పరిధిలో నిర్వహించారు. అక్కడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. ఈసందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మో హన్‌రెడ్డి అని అన్నారు. 17 రకాల సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వం ప్రతి ఒక్కరి సంక్షేమానికి కట్టుబడి ఉందని చెప్పారు. పేదలకు అందిస్తున్న ఆర్థిక సహాయానికి ప్రతిపక్షాలు గండికొట్టే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. నవరత్నాలు పథకాల ద్వారా ప్రజలకు అభివద్ధి, సంక్షేమ ఫలాలు అందడాన్ని ప్రతిపక్షాలు జీర్ణించు కోలేకపోతున్నాయన్నారు. ప్రజల వద్దకే పాలనను తీసుకొచ్చేందుకు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి స్థానికంగానే సమస్యలు పరిష్కరించడం సీఎం వైఎస్ జగన్ దార్శనికతకు నిదర్శనమన్నారు. అందరికీ మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని ప్రజలను కోరారు. తొలుత గ్రామ ప్రజలు మంత్రి సురేష్ పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు.

ముందుగా రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయం1 భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎల్డీఓ సాయి కుమార్, తహసీల్దార్ వి.కిరణ్, ఎంపీడీఓ సాంబశివరావు, ఎంఈఓ మల్లికార్జు ననాయక్, ఏఓ కె.నీరజ, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, మాజీ ఎంపిపి ఆళ్ల ఆంజనేయ రెడ్డి, జెడ్పీటీసీ మాకం జాన్పల్, సర్పంచ్ పొన్నా వెంకటలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు దగ్గుల గోపాలరెడ్డి, మండల కనీ దేవస్థాన ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ మల్లికా ర్జున్, పార్టీ నాయకులు సత్యనారాయణ రెడ్డి, వెంగళరెడ్డి, వెంకటరెడ్డి, రంగబాబు నక్కా చిన్న త్రిపురారెడ్డి, శ్రీను, నాసరయ్య, హనుమంత రావు. యోగయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అరాచకపు పాలనకు

చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధం

- కనిగిరి నియోజకవర్గంలో ప్రవేశించిన భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్యయాత్ర
- గుడిపాడులో టిడిపి నాయకులకు ఘన స్వాగతం


టిడిపి నాయకులకు హారతులిచ్చి.. ఆహ్వానం పలుకుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-కనిగిరి

వైసీపీ అరాచకపు పాలనకు ప్రజలు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టిడిపి నేతలు అన్నారు. భవిష్యత్‌కు గ్యారెంటీ చైతన్యరథయాత్ర శుక్రవారం సాయంత్రం కనిగిరి నియోజకవర్గంలో ప్రవేశించింది. కనిగిరి నియోజకవర్గంలోని కనిగిరి మండలం పునుగోడులో చైతన్య రథయాత్ర ప్రవేశించగా టిడిపి నాయకులకు టిడిపి శ్రేణులు ఘనస్వాగతం పలికారు. మహిళలు కర్పూరహారతితో ఆహ్వానించారు. అనంతరం రామాలయం,మసీదు,చర్చిలలో ప్రార్ధనలు నిర్వహించటం జరిగింది. గ్రామంలో టిడిపి శ్రేణులు భారీ ర్యాలీ చేపట్టటం జరిగింది. రచ్చబండ కార్యక్రమంలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కొండపి ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామి, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు నూకసాని బాలాజి, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, గిద్దలూరు ఇంచార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి, ఎర్రగొండపాలెం ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ సంక్షేమం పేరుతో అభివృద్ధిని వైసీపీ ప్రభుత్వం మరిచిపోయిందని తెలిపారు. ప్రజలపై బాదుడే బాదుడు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి ఇబ్బందుల పాలుచేశారని విమర్శించారు. టిడిపి ప్రభుత్వం హాయంలో రాష్ట్రం అభివృద్ధి బాటన పయనించిందని తెలిపారు. చంద్రబాబునాయుడు సారథ్యంలోనే రాష్ట్రం అభివృద్ధిచెందుతుందన్నారు. వెనుకబడిన కనిగిరి నియోజకవర్గం అభ్యున్నతి చెందాలంటే టిడిపి విజయం సాధించాలని సూచించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పల్లెనిద్ర కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి మండలపార్టీ అధ్యక్షులు నంబుల వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు ముచ్చుమారి చెంచిరెడ్డి, బేరి పుల్లారెడ్డి, నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకంలో ముగ్గురికి ఉద్యోగాలు

నియామక పత్రాలు అందజేసిన జడ్పీ చైర్‌పర్సన్


నియామక పత్రాలు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్యం పరిధిలో పని చేస్తూ మరణించిన సిబ్బంది కుటుంబ సభ్యులు ముగ్గురికి కారుణ్య నియామకంలో ఉద్యోగాలు వచ్చాయి. జడ్పీ హైస్కూళ్ళు, ఎంపిడిఒ కార్యాలయాలలో ఆఫీస్ సబార్డినెట్స్‌గా నియమిస్తూ జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ నియామక పత్రాలు అందజేశారు. ఆర్.లక్ష్మి నారాయణమ్మకు పిసిపల్లి మండలం పెద అలవలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, బి.పార్వతికి ముండ్లమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, పి.వెంకటేశ్వరరావును చిన్నగంజాం మండల ప్రజా పరిషత్‌లో ఆఫీస్ సబార్డినేట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ సిఇఒ బి.జాలిరెడ్డి, ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి సి.హనుమంత రావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల గొంతుక 'లూకయ్య'

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి - ఘనంగా లూకయ్య సంస్మరణ సభ


లూకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రమాదేవి

ప్రజాశక్తి-చీరాల

ఉపాధ్యాయ సమస్యల గొంతుక యుటిఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి పి.లూకయ్య అని, ఉపాధ్యాయ రంగంలో ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసి వారిని తీర్చిదిద్దారని పలువురు కొనియాడారు. ఉపాధ్యాయ రంగంలో పి.లోకయ్య ఆయన సతీమణి ఎస్‌డి కరుణ కుమారి సేవలు ఎంతో ప్రశంసనీయమని అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్జీవో కార్యాలయంలో కామ్రేడ్ పి.లూకయ్య సంస్మరణ సభ యుటిఎఫ్, కెవిపిఎస్, జెవివి, సిఐటియు ఆధ్వర్యంలో సభాధ్యక్షులు కుర్ర రామారావు అధ్యక్షతన ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కే శ్రీనివాసరావు, కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య హాజరై మాట్లాడారు. చీరాల ప్రాంత ఉపాధ్యాయ ఉద్యమ నేతగా సామాజిక ఉద్యమ కార్యకర్తగా, నిస్వార్థ ప్రజా సేవకునిగా ఎంతో నిబద్ధతతో అలుపెరుగని పోరాటం చేశారని అన్నారు. లూకయ్య 1974 లో చీరాల మున్సిపాలిటీలో ఉపాధ్యాయుడిగా జీవితం ప్రారంభం నుండి రిటైర్మెంట్ నాటి వరకు యూటీఫ్ ఫౌండర్ సభ్యుడిగా, నాయకుడిగా వివిధ క్యాడర్‌లలో పనిచేశారు. యూటీఫ్‌లో కొనసాగుతూనే జనవిజ్ఞానవేదికలో 1988 నుంచి చీరాల ప్రాంతంలో వ్యవస్థాపకుడిగా వున్నారు. 1998 కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం వ్యవస్థాపకుడుగా, 2002 నుంచి గుర్రం జాషువా సాహితీ సమితి వ్యవస్థాపకుడిగా, , కార్మిక పోరాటాలకు సహకారిగా సీపీఎంలో సభ్యుడిగా సుదీర్ఘ కాలం పాటు ఉన్నారు. ఆయన యావత్ జీవి తం ప్రజాఉద్యమాలకు అంకితం చేశారని కొని యాడారు. ముందుగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు వీరాంజనేయులు, యుటి ఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షులు వినయ్‌కుమార్, జిల్లా కార్యదర్శి బండి బిక్షాలు, కెవిపిఎస్ నాయకులు ఎల్ జయరాజు, సిఐటియు నాయకులు ఎన్ బాబురావు, వసంతరావు, పి కొండయ్య పాల్గొన్నారు.